118 జీఓను పునరుద్ధరించాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎల్‌బీనగర్: గత ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన జీఓ 118ను వెంటనే పునరుద్ధరించి 22–ఏ భూమి నిషేధిత చట్టం నుంచి తొలగించి ఇళ్ల రిజిస్ట్రేషన్లు అయ్యేలా చర్యలు తీసుకోవాలని పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎస్‌కేడీనగర్ సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పుల్లారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రాంబాబు, రాజిరెడ్డి, ముత్యం రావు మాట్లాడారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ 118జీఓ బాధితుల ఐక్యవేదిక పేరుతో కొంత మంది కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఈ జీఓ గురించి ప్రజలను భయబ్రాంతులకు గురిచేసి తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఖాళీ స్థలాల ఆస్తి పన్నును ఇంటి పన్ను చెల్లించే వారికి రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 118జీఓ ద్వారా కన్వేయన్స్ డీడీ పొందిన వారు తమ పాత ఇంటిని కూల్చివేసి జీహెచ్ఎంసీ అనుమతులు పొంది రుణాలు తీసుకున్న వారు చాలా మంది ఉన్నారన్నారు. ఇటీవల ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీసీఎల్‌ఏ కమిషనర్‌ను కలవడం జరిగిందని త్వరలోనే రెవెన్యూ మంత్రికి ఈ జీఓ ఇబ్బందులను వివరిస్తామని, ఈ సమస్య పరిష్కారిస్తారని నమ్మకం ఉందన్నారు. ఈ సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్, జగన్‌మోహన్‌రెడ్డి, యాదగిరి,రాజుయాదవ్, కృష్ణరావు, కృష్ణరెడ్డి జానకి రామారావు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు.. మృత్యుకుహరాలుగా మ్యాన్‌హోళ్లు

- నాసిరకం పనులతో కొన్నాళ్లకే ధ్వంసం
- మరమ్మతు చేయాలంటున్న వాహనదారులు
- విస్మరిస్తున్న అధికారులు


కమలానగర్ కాలనీలో గుంతలు పడ్డ రోడ్డు

చైతన్యపురి: గడ్డి అన్నారం డివిజన్‌లోని పలు కాలనీల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. ఏ రోడ్డు చూసినా కటింగ్‌లు, గుంతలే దర్శనం ఇస్తున్నాయి. అంతేకాక రహదారుల మధ్యలో ఉన్న మ్యాన్‌హోళ్ల నిర్మాణం నాసిరకంగా ఉండటం, అసంపూర్తిగా వదిలేయటంతో ప్రమాదాలకు చిరునామాలుగా మారుతున్నాయి. అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డు తవ్వకాలు చేసి మరమ్మతు చేయకపోవటంతో రహదారులన్నీ గోతులమయంగా మారాయి. కమలానగర్, మధురానగర్, గౌతంనగర్, లలితానగర్, పీఅండ్‌టీ కాలనీల్లో ప్రధాన రోడ్లు పూర్తిగా గుంతలుగా మారటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు మధ్యలో గొయ్యిలా ఏర్పడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం తమకు సంబంధం లేనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కువగా ధ్వంసమైన రోడ్లు, మ్యాన్‌హోళ్ల వద్ద అడ్డుగా గ్రిల్స్ పెట్టి తమపని ఇంతే అంటూ చేతులు దులుపుకుంటున్నారు తప్ప.. వాటికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు చేసినా స్పందన లేదు..



రహదారులు గుంతలుగా మారి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కనీసం ద్విచక్రవాహనం నడిపే వీలు లేకుండా పోయింది. ఇష్టానుసారంగా రోడ్డు తవ్వకాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. డ్రైనేజీ, తాగునీటి పైపుల ఆధునీకరణకు రోడ్డు తవ్వకాలు జరిపి పనులు పూర్తయిన వెంటనే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకోవాలి. మధురాపురి కాలనీ స్వర్ణకార వీధిలో మూడు మ్యాన్‌హోళ్లు కుంగి ప్రమాదకరంగా మారాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు.

–కీర్తిగారి అనంతాచారి, మధురాపురి కాలనీ

నిధులు లేక పనులు చేయటం లేదు..



డివిజన్‌లోని పలు కాలనీల్లో రహదారులు గుంతలుగా మారిన విషయం వాస్తవమే. ఎప్పుడో 20 ఏళ్ల క్రితం వేసిన రోడ్లు పాడైపోతే కనీసం మరమ్మతు కూడా చేయించలేని పరిస్థితి నెలకొంది. జీహెచ్ఎంసీ ఏఈ, డీఈలకు ఫిర్యాదులు చేసినా స్పందన లేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తే నిధులు లేవంటున్నారు. కార్పొరేటర్లు వివిధ సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.

–బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్, గడ్డిఅన్నారం డివిజన్

నాణ్యత లేక శిథిలావస్థకు..

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని కటకోనికుంట, నెహ్రూనగర్, రెడ్డి బస్తీ, దుర్గాభవానీనగర్ వంటి పలు కాలనీలలో ప్రధాన రహదారిపై కుంగిన, రోడ్డుకు సమాంతరంగా లేకుండా హెచ్చుతగ్గులతో ఉన్న మ్యాన్‌హోళ్లతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. చంపాపేట చౌరస్తా సమీపంలోని మానసా గార్డెన్ నుంచి రెడ్డి బస్తీ, ఏడ బస్తీకి వెళ్లే మార్గంలో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ పెరుగుతున్న కాలనీవాసుల అవసరాన్ని తీర్చేవిధంగా లేకపోవటం, మ్యాన్‌హోళ్లు, భూగర్భ డ్రైనేజీ శిథిలావస్థకు చేరటంతో రహదారి కుంగి గుంతలుగా మారి నిత్యం మురుగు రోడ్లపై ఏరులై పారుతోంది. గత ఆరు నెలల క్రితం సర్కిల్ ఇంజినీరింగ్, వాటర్‌వర్క్స్ విభాగ సిబ్బంది తూతూ మంత్రంగా నాణ్యత లేని మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేయటంతో మళ్లీ శిథిలావస్థకు చేరి మృత్యు బిలాలుగా మారాయి. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవటంతో మ్యాన్‌హోళ్లు కుంగిపోతున్నాయి.ఈ సమస్యలపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మానసా గార్డెన్ నుంచి ఏడ బస్తీ వరకు ఇరుకైన కాలనీ ప్రధాన రహదారి. ఇదే మార్గంలో మైనారిటీ గురుకుల పాఠశాల కూడా ఉంది. నిత్యం వందల సంఖ్యలో అదే మార్గంలో విద్యార్థులు, వాహనదారులు, రాకపోకలు సాగిస్తుంటారు. ఆ మార్గంలో ఉన్న పాతకాలం నాటి మ్యాన్‌హోళ్లు కుంగిపోయాయి. ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన మ్యాన్‌హోళ్లకు మరమ్మతు చేయాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు.


మానసా గార్డెన్ రహదారిపై కుంగిన మ్యాన్‌హోల్


రెడ్డి కాలనీ ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఇలా..

ఇంత నిర్లక్ష్యమా..



చంపాపేట గాంధీ విగ్రహం చౌరస్తాలతో పాటు, మోడల్ మార్కెట్ ఎదురుగా, మారుతీనగర్ చౌరస్తాలో నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ మార్గంలో ప్రతీ మ్యాన్‌హోల్ కుంగిపోయి ఉంది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పాదచారులు, వాహనదారులు భయాందోళనకు గురవుతుంటారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. సమస్యల పరిష్కారంలో ఇంత నిర్లక్ష్యమా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

–రాము, చిలుక బస్తీ

‘ప్రభుత్వంపై ఓర్వలేక ఫుడ్ పాయిజన్ కుట్ర’


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

మలక్‌పేట: ప్రజా ప్రభుత్వంపై ఓర్వలేక గురుకులాల ఫుడ్ పాయిజన్ కుట్రకు పాల్పడుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మలక్‌పేటలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వ హయాంలో ఒక్కసారి కూడా డైట్ చార్జీలు పెంచాలేదని, సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ 40 శాతం డైట్ చార్జీలు పెంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తుందన్నారు. గురుకులాలపై మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తన మనుషులతో కుట్రలు అమలు చేస్తున్నాడని ఆరోపించారు. బీఆర్ఎస్ విధానాల పట్ల విసిగిపోయిన ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటికి పంపించారన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని బీఆర్ఎస్ నేతల తప్పుడు ఆరోపణలకు ప్రజలే గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో లింగాల శ్రీనివాస్‌గౌడ్, రాహుల్‌సింగ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షకీల్, మహేష్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు


డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

నాగోలు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం రాత్రి ఎల్‌బీనగర్ కామినేని ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ పలువురికి కౌన్సెలింగ్ నిర్వహించి పంపించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మద్యం తాగి వాహనాలు నడిపి జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు.

క్రెడిట్ కార్డు పేరుతో మోసం

నాగోలు: క్రెడిట్ కార్డులో అదనపు ఛార్జీలు పడకుండా చేస్తానని రూ. 1.33 లక్షలు కాజేసిన ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..రాఘవేంద్రనగర్ కాలనీలో ఉండే వేణుగోపాల్ సాయికి గత నెల 30న ఓ నంబర్ నుంచి కాల్ వచ్చింది. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డులో అంతర్జాతీయ లావాదేవీల సేవలు ఉన్నాయని, ఎస్‌బీఐ యాప్ ద్వారా ఈ ఫీచర్‌ను డిసేబుల్ చేయమని వేణుగోపాల్‌కు సూచించాడు. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ఉపయోగించినా ఎలాంటి ఛార్జీలు పడవని సూచించడంతో ఇది నమ్మిన బాధితుడు ఎస్‌బీఐ యాప్‌ని ఓపెన్ చేశాడు, కానీ ఆ ఫీచర్ ఓపెన్ కాలేదు. నిందితుడు ఇన్‌స్టాల్ చేసిన వాట్సాప్ ద్వారా యాప్‌ను షేర్ చేయగా బాధితుడు తన క్రెడిట్ కార్డు వివరాలను ఆ యాప్‌లో నమోదు చేయగా ఎస్‌బీఐ, ఐసిఐసిఐ క్రెడిట్ కార్డుల నుంచి రూ. 1.33 లక్షలు వేరే ఖాతాల్లోకి వెళ్లాయి. మోసపోయినట్లు గ్రహించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మార్మోగిన అయ్యప్ప నామం


పూజలో పాల్గొన్న నల్లు ఇంద్రసేనారెడ్డి


మహాపడిపూజ నిర్వహిస్తున్న తోట మహేష్‌యాదవ్


మహాపడి పూజ నిర్వహిస్తున్న భక్తులు

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప మహాపడి పూజ ఘనంగా జరిగింది. మారుతీనగర్ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి చైతన్యపురి కాలనీ వరకు అయ్యప్ప ఆభరణాలు, పల్లకి ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. అయ్యప్ప భజన పాటలతో హోరెత్తించారు.

మోహన్‌నగర్‌లో..

నాగోలు: కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ బాలాజీ కాలనీలో ప్రసాద్ గురుస్వామి ఆధ్వర్యంలో కామరౌతు రామరాజు వర్మ స్వామి 18వ అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అనంతుల సురేందర్ రెడ్డి పాల్గొని స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు.

సాయినగర్ కాలనీలో..

నాగోలు: నాగోలు సాయినగర్ కాలనీలో శ్రీమైసమ్మ పోచమ్మ దేవాలయ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకులు సిద్దాల ఐలయ్య నివాసంలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప పడిపూజలో త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దాల ఐలయ్య కుటుంబ సభ్యులు గవర్నర్ ఇంద్రసేనా రెడ్డిని సన్మానించారు.

ప్రవచనకర్త విజయలక్ష్మి కన్నుమూత


విజయలక్ష్మి(ఫైల్)

నాగోలు: ప్రముఖ ప్రవచనకర్త శ్రీ సమర్థ మాతాజీ విజయలక్ష్మి ఆదివారం కొత్తపేట డివిజన్ స్నేహపురికాలనీలోని తన నివాసంలో కన్నుమూశారు. విజయలక్ష్మి అనేక ఏళ్ల నుంచి పంచముఖ ఆంజనేయ స్వామి ఉపాసకురాలిగా ఉంటూ ఆర్‌కేపురం, స్నేహపురికాలనీ, కొత్తపేట పరిసర ప్రాంతాల్లో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రవచనాలు చేసేవారు.

యువతి అదృశ్యం


వెన్నెల

నాగోలు: పనికోసం బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..తట్టిఅన్నారం, ఆర్‌కేనగర్‌కు చెందిన దేవులపల్లి వెన్నెల (20) బట్టల దుకాణంలో పని చేస్తుంది. గత నెల 29న పనికి వెళ్లిన వెన్నెల రాత్రైనా ఇంటికి రాలేదు. బంధువుల, స్నేహితులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాలల సింహగర్జనకు తరలివెళ్లిన నాయకులు

మలక్‌పేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం సికింద్రాబాద్‌లో చేపట్టిన మాలల సింహగర్జనకు మలక్‌పేట నుంచి మాలలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మలక్‌పేట నియోజకవర్గం మాల సంఘం అధ్యక్షుడు ముప్పిడి బల్వంత్ ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి మూసారంబాగ్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సికింద్రాబాద్ గ్రౌండ్‌కు తరలివెళ్లారు.

నవల ఆవిష్కరణ

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్‌కు చెందిన కొత్త అరుణ్ రచించిన కురుక్షేత్ర అనుస్మరణాయ నవలను ఆదివారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

హస్తినాపురం: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం జీఎంఆర్ టెన్నిస్ కోర్టులో నిర్వహించిన టోర్నమెంట్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని ప్రతిరోజు క్రీడలకు పాఠశాలలలో గంట సమయం కేటాయించాలన్నారు. మెన్ సింగిల్స్‌లో విన్నర్‌గా రాంచందర్, రన్నర్ సాయిగణేశ్, డబుల్ విన్నర్స్ దాసు, కబీర్, రన్నర్స్ రామచంద్రం, మల్లేశ్‌కు ట్రోఫీలు అందజేశారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాట రూ.43, వంకాయ రూ. 35, బెండ రూ. 45, పచ్చిమిర్చి రూ. 35, కాకర రూ. 26, బీర రూ. 45, క్యాబేజీ రూ. 31, ఫ్రెంచిబీన్స్ రూ. 45, క్యారట్ రూ. 47, దొండ రూ. 35, చిక్కుడు రూ. 58, గోకర రూ. 28, బీట్‌రూట్ రూ. 43, క్యాప్సికం రూ. 55, ఆలు రూ. 38, దోస రూ. 27, సొరకాయ రూ. 15, పొట్లకాయ రూ. 23, ఉల్లిగడ్డ రూ. 50, చామగడ్డ రూ. 35. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కరాటే పోటీలో సత్తా



చంపాపేట: మలేషియాలో జరుగుతున్న మలేషియా ఓపెన్ ఇంటర్నేషనల్ కరాటే అండర్–19 ఛాంపియన్ షిప్‌లో ఎల్‌బీనగర్‌కు చెందిన విద్యార్థులు నాలుగు స్వర్ణాలు, రెండు రజతం, మూడు కాంస్య పతకాలు సాధించారని కోచ్ ఆర్ రాజు ఆదివారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. విజేతలు శాన్వి నాయక్, కిషోర్, శ్రీకీర్తి, ప్రణవ్, సందీప్ మరో నాలుగు రోజుల్లో భారత్‌కు రానున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

టీజీపీఎస్సీ చైర్మన్ నియామకంపై హర్షం

చాదర్‌ఘాట్: తెలంగాణ టీజీపీఎస్సీ చైర్మన్‌గా బుర్రా వెంకటేశంను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. బుర్రా వెంకటేశం ఈ పదవికి అన్నివిధాల అర్హుడని ఆయనను టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు అన్నారు.

నీటిమీద రాతల్లాగా రేవంత్ రెడ్డి వాగ్దానాలు

ఎంపీ ఈటల రాజేందర్


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

చైతన్యపురి: సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు డిక్లరేషన్లు నీటి మీద రాతలే అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామరంగారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో నెరవేరని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా విఫలమైందన్నారు. గత ఎన్నికల్లో 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు, 66 వాగ్దానాలు నెరవేరుస్తామని ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చారన్నారు. ఏడాది పాలనలో ఒక్క గ్యారంటీని పూర్తిస్థాయిలో అమలు చేయక ప్రజలను వంచిస్తుందన్నారు.లగచర్లలో భూసేకరణ పేరిట రైతులపై అక్రమ కేసులు పెట్టి పోలీసులతో దాడులు చేయించటం కాంగ్రెస్ అప్రజాస్వామిక పాలనకు నిదర్శనం అని విమర్శించారు. తెలంగాణ ప్రజలు గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అనుభవించిన కష్టాలు కాంగ్రెస్ ఏడాది పాలనలోనే అనుభవించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమేందర్‌రెడ్డి, కొత్త రవీందర్‌రెడ్డి, అందెల శ్రీరాములుయాదవ్, వేణుగోపాల్‌రెడ్డి, చింతల సురేందర్‌యాదవ్, కార్పొరేటర్లు బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, కళ్లెం జీవన్‌రెడ్డి, లచ్చిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


పోటీలు పర్యవేక్షిస్తున్న రాధాకృష్ణ

మలక్‌పేట: ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం మలక్‌పేట ఉన్నత పాఠశాలలో ఎడ్యుకేషన్ డే ఘనంగా జరిగింది. ‘పునరుత్పాదక శక్తి వనరులు’ అనే అంశంపై విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు సైదాబాద్ మండల డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మండలం–1 నుంచి 21 మంది విద్యార్థులు హాజరుకాగా.. మాదన్నపేట జీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థిని ఎస్. హర్షితరెడ్డి ప్రథమ, కాచిగూడ జీజీహెచ్‌కు చెందిన బి. కావేరి ద్వితీయ, అర్సాలా బటూల్ ఘోరీ కన్సోలేషన్ బహుమతులు సాధించారు. మండలం–2 విభాగం నుంచి 39 మంది హాజరు కాగా..గవర్నమెంట్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ విద్యార్థి సోహేఖాన్ మొదటి స్థానం, బాగ్‌మూసారిమో జీహెచ్ఎస్ విద్యార్థి హిమశ్రీ రెండోస్థానం, మలక్‌పేట జీజీహెచ్ఎస్ బ్లైండ్ విద్యార్థి హర్షితకు కన్సోలేషన్ బహుమతి లభించిందన్నారు.

సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ..


మాట్లాడుతున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హయత్‌నగర్ ఎంఆర్‌ఓ జానకి, ఎంఈఓ శ్రీనివాస్ రావు పాల్గొని మాట్లాడారు. వ్యాసరచన పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దినేష్, ఇందిరా, దుర్గాలత, ఏఏపీసీ కమిటీ చైర్మన్ మమత, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలి


సమావేశంలో పాల్గొని బీజేపీ నాయకులు

నాగోలు: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని త్వరలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టే నిరసన కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రంగారెడ్డి అర్బన్ అధ్యక్షులు సామ రంగారెడ్డి అన్నారు. ఆదివారం కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో సామ రంగారెడ్డి, కార్పొరేటర్ పవన్ కుమార్ మాట్లాడారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే నిరసన కార్యక్రమాలు, సభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి


నిత్యావసర సరుకులు అందజేస్తున్న రాము

మన్సూరాబాద్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైస్ ఏటీఎం నిర్వాహకుడు దోసపాటి రాము అన్నారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌హిల్స్‌కాలనీలోని రైస్ ఏటీఎం వద్ద ఆదివారం పలువురికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. కొవిడ్ తర్వాత చాలా కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. కొవిడ్ అనంతరం ఆరోగ్య సమస్యలు ఏర్పడి ఆర్థిక కష్టాలు పెరిగి రైస్ ఏటీఎం వద్దకు సాయం కోసం వస్తున్నారని ప్రతి శని, ఆదివారాల్లో తమకు తోచిన సహాయం చేస్తున్నామన్నారు.

ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: వనస్థలిపురం ఫేజ్–2లోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో కార్తీకమాసం ముగింపు సందర్భంగా ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఆలయ చైర్మన్ ఎంవీ.మణిశేఖర్, అధ్యక్షుడు గాండ్ల అంజయ్య, ప్రధాన కార్యదర్శి రాపోలు పురుషోత్తం, కోశాధికారి ఉప్పు వెంకటేష్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం


చెక్కు అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: సీఎంఆర్‌ఎఫ్ పేదల వరం లాంటిదని జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు.లింగోజిగూడ డివిజన్ పరిధిలోని ఎల్‌బీనగర్ ఓల్డ్ విలేజ్‌కు చెందిన పుటరి సంతోష్‌కు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం రాజశేఖర్‌రెడ్డి అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీధర్‌గౌడ్, సుంకోజు కృష్ణమాచారి, శ్రీధర్‌గౌడ్, రాము, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా రుద్రయాగ మహోత్సవం



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురి కాలనీలో శ్రీ విద్యాశక్తి పీఠం, తెలంగాణ వైదిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న చాణక్య మహాశయుడి విగ్రహస్థాపన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకొని ఆలయంలో రుద్రయాగ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజలో టీపీసీసీ అధికార ప్రతినిధి రాజిరెడ్డి, నాయకులు సురేందర్‌రెడ్డి, విద్యా శక్తిపీఠం వ్యవస్థాపకులు నారాయణ చక్రవర్తి వర్మ, నిర్వాహకులు సుధాకర్ శర్మ, రామ్ సుధాకర్ వర్మ పాల్గొన్నారు.